
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

గురువారం 4 సెప్టెంబరు 2025



దుబ్బాకలోని ఛత్రపతి శివాజీ యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి బుధవారం 108 రకాల ప్రసాదాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- దుబ్బాక, సెప్టెంబరు 3



గజ్వేల్ పట్టణంలో యూరియా కోసం అధికారులను నిలదీస్తున్న రైతులు

యూరియా పాట్లు

- ఒక్కో బస్తాపై అదనంగా రూ.40 వసూలు

7

అక్షరాస్యతతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం

- ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్

7



రాజీవ్‌పార్కు అభివృద్ధిపై కలెక్టర్‌కు వివరిస్తున్న జగ్గారెడ్డి

కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో కలిసి రాజీవ్‌పార్క్‌ను పరిశీలించిన

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, జగ్గారెడ్డి

- టీయూఎఫ్ఐడీసీ, హెచ్ఎండీఏ నిధులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా

సంగారెడ్డిటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ పి.ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సంగారెడ్డిలోని రాజీవ్ పార్కును బుధవారం టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పరిశీలించారు. టీయూఎఫ్ఐడీసీ, హెచ్ఎండీఏ నిధులతో రాజీవ్ పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేశారు. అంశాల వారీగా పరిశీలిస్తే

- మూడు కోట్ల రూపాయల టీయూఎఫ్ఐడీసీ నిధులతో రాజీవ్ పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు
- రాజీవ్ పార్కు అభివృద్ధి నమూనాల కోసం హెచ్ఎండీఏ సహకారం తీసుకోవాలని నిర్ణయం
- లైటింగ్, టాయిలెట్ బ్లాక్, ల్యాండ్ స్కేపింగ్ చేయించాలని కలెక్టర్‌కు వివరించిన అధికారులు
- రాజీవ్‌పార్కులో ఉన్న మ్యూజికల్ ఫౌంటేన్, వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలని అధికారులకు సూచించిన కలెక్టర్
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సంగారెడ్డి ప్రజలకు ఆహ్లాదం అందించేలా రాజీవ్‌పార్కును తీర్చిదిద్దిన విషయాలను జగ్గారెడ్డి కలెక్టర్‌తో పంచుకున్నారు
- పార్కును ఆనుకుని ఉన్న స్విమ్మింగ్‌పూల్, దానికి ఆనుకుని ఉన్న భూమిని కలుపి డెవలప్‌మెంట్ చేయాలి
- పార్కును ఆనుకుని ఉన్న ఎకరన్నర స్థలంలో మినీ పాండ్, పెడల్ బోట్లు ఏర్పాటు చేసేలా డిజైన్ చేయాలని అధికారులకు సూచించిన కలెక్టర్
- స్విమ్మింగ్‌పూల్, టాయిలెట్స్, డ్రెస్సింగ్‌రూమ్‌ల రిపేర్ కోసం నిధులు కావాలని కలెక్టర్‌ను కోరిన అధికారులు



రాజీవ్ పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి

- స్విమ్మింగ్‌పూల్‌లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా టైమింగ్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచన
- స్విమ్మింగ్‌పూల్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో పీపీటీ పద్ధతిలో స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించిన కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్.

ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

తొగుట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తొగుట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కలెక్టర్ హైమావతి బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అటెండెన్స్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధులతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి అన్ని రకాల వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమం లో తొగుట పీహెచ్‌సీ వైద్యులు రాధాకిషన్, సిబ్బంది ఉన్నారు.

నిమజ్జనం సందర్భంగా

వైన్స్‌లు బంద్

సిద్దిపేటక్రైం సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన సందర్భంగా జిల్లాలో అన్ని వైన్ షాపులు, బార్లు, కల్లు దుకాణాలు బంద్ చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ శ్రీనివాస్ మూర్తి తెలిపారు. 5వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 6 గంటల వరకు మూసి వేయనున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం దుకాణాలు తెరిస్తే వారి పై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాళ్లు మొక్కుతాం ఆదుకోండి

- కలెక్టర్‌తో రైతుల వేడుకోలు
- మంగోల్ మిషన్ భగీరథ పంప్‌హౌజ్ వద్ద క్లోరిన్ గ్యాస్ లీక్
- 20 ఎకరాల వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "కలెక్టర్ మేడం, మా పంటలు తీవ్రంగా నష్టపోయాయి. మీ కాళ్లు మొక్కుతాం.. దయచేసి మమ్మల్ని ఆదుకోండి " అంటూ రైతులు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతిని వేడుకున్నారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మంగోల్ శివారులో ఉన్న మిషన్ భగీరథ పంప్ హౌజ్ వద్ద తాగునీటి శుద్ధి కోసం ఉపయోగిస్తున్న క్లోరిన్ గ్యాస్ అనుకోకుండా లీకై ఆ ప్రభావం పక్కనే ఉన్న దాదాపు 20 ఎకరాల వరి, పత్తి పంటలపై పడింది. మంగళవారం దీనిని గమనించిన రైతులు పంప్‌హౌజ్ నిర్వాహకులు, మిషన్ భగీరథ డీఈ దృష్టికి తీసుకువెళ్లారు. బుధవారం విషయం తెలుసుకున్న కలెక్టర్ హైమావతి నష్టపోయిన పంటలను పరిశీలించారు. అనంతరం క్లోరిన్ గ్యాస్ ఎక్కడ, ఎలా లీక్ అయిందో ఆ ప్రదేశాన్ని పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంపై ఇద్దరు శాస్త్రవేత్తలతో కూడిన బృందం వివరాలను సేకరిస్తుందని, అనంతరం పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందజేస్తామని ఎవరూ కూడా దిగులు చెందవద్దని ఆమె రైతులకు హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట డీఏవో, మిషన్ భగీరథ ఉన్నతాధికారులు, ఎంపీడీవో, ఎమ్మార్వో, ఏవో తదితరులు ఉన్నారు.

ఎకరానికి రూ.40వేల నష్టపరిహారం ఇవ్వాలి : రైతులు

క్లోరిన్ గ్యాస్ లీక్ వల్ల తమ పంటలు పూర్తిగా నాశనమయ్యాయని, 14 మంది రైతులు 20 ఎకరాల పంటలు నష్టపోయారని, ఆ సమయంలో పొలంలో ఉన్నవారికి కళ్ల తీవ్రంగా మండి, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎకరానికి రూ. 40 వేల నష్టపరిహారం అందించాలని కోరారు. మిషన్ భగీరథ నిర్వాహకులు తమతో మంగళవారం దురుసుగా ప్రవర్తించారని, ఏం జరిగిందో చెప్పలేదని, ఆ తర్వాత తాము గట్టిగా నిలదీయడంతో క్లోరిన్ గ్యాస్ వల్ల పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారని రైతులు వివరించారు.



కలెక్టర్‌తో మొరపెట్టుకుంటున్న రైతులు

సాఫీగా సాగేదెలా?

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు, గుంతలమయంగా రోడ్లు
- సిద్దిపేట, గజ్వేల్ పరిధిలోనే అధికం..
- జిల్లాలో 54 ప్రాంతాల్లో, దాదాపు 19.64 కి.మీ. మేర ధ్వంసం
- ప్యాచ్‌వర్క్‌కు రూ. 3.26 కోట్లు.. శాశ్వత రోడ్ల నిర్మాణానికి రూ.29.82 కోట్లు అవసరం

ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ముఖ్యంగా రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు పలు రహదారులు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. రాత్రిపూట ప్రయాణించేవారు ఈ గుంతలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు.



అక్బర్‌పేట-భూంపల్లిలోని రుద్రారంలో తెగిపోయిన రోడ్డు



దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో కూలిన కల్వర్టు

సిద్దిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. 20 సెం.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో అనేక చోట్ల రోడ్లు, కల్వర్టులు తెగిపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా సిద్దిపేట, చిన్నకోడూర్, సిద్దిపేటరూరల్, వర్గల్, గాజులపల్లి, వీరారెడ్డిపల్లి, దొమ్మాట, వెంకట్రావుపేట, చందాపూర్, రుద్రారం, ఖాజీపూర్, కొలుగూరు వంటి ప్రాంతాల్లో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సిద్దిపేట పరిధిలో 25 ప్రాంతాల్లో, గజ్వేల్ పరిధిలో 29 ప్రాంతాల్లో రోడ్ల నష్టం ప్రభావం అధికంగా ఉంది.

అంచనాలు వేసిన అధికారులు

వర్షాల వల్ల ధ్వంసమైన రోడ్ల శాశ్వత నిర్మాణం చేపట్టాలంటే రూ. 29.82 కోట్లు నిధులు అవసరం కానున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా 54 ప్రాంతాల్లో 19.64 కిమీ. మేర రహదారులు ధ్వంసమైనట్లు తేల్చారు. సిద్దిపేట పరిధిలోని 25 ప్రాంతాల్లో ప్యాచ్ వర్క్ చేయాలంటే 1.55 కోట్లు, గజ్వేల్ పరిధిలోని 29 ప్రాంతాల్లో రూ.1.71 కోట్లు మొత్తంగా 3.26 కోట్లు, శాశ్వతంగా రోడ్ల నిర్మాణానికి సిద్దిపేటకు రూ. 13.05 కోట్లు, గజ్వేల్‌కు రూ. 16.77 కోట్లు, మొత్తంగా 29.82 కోట్లు నిధులు అవసరమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మిగతా 8వ పేజీలో



పూర్తిగా ధ్వంసమైన జప్తినాచారం రోడ్డు

సీబీఐ, ఈడీని పంపినా న్యాయమే గెలుస్తుంది

- 2028లో కాంగ్రెస్ మంత్రులకు, ఎమ్మెల్యేలకు డిపాజిట్లు కూడా రావు
- లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఖతం చేస్తాం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ లక్ష కోట్లు తిన్నారని కాంగ్రెస్ నాయకులు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని, సీబీఐ, ఈడీని పంపినా న్యాయం, ధర్మం గెలిచి కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటపడతారని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ తొగుట మండలం తుక్కాపూర్ శివారులో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టపై బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2028లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పుడు అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులకు డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. అప్పటివరకు కాకుండా, రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఖతం చేయడానికి బీఆర్ఎస్ ఉద్యమకారులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆశీస్సులు కేసీఆర్‌కే ఉన్నాయని, కాంగ్రెస్ నేతలు ఎన్ని ఆరోపణలు చేసినా ఆయన బయటకు వచ్చి వారి భరతం పడతారని హెచ్చరించారు. ఈ ప్రాంతం కరువు కాటకాలతో నీళ్ల లేక అల్లాడుతుంటే కేసీఆర్ మల్లన్నసాగర్ నిర్మాణం చేపట్టారని చెప్పారు. మల్లన్నసాగర్, కాళేశ్వరం కూలిపోయాయని, ఒక్క ఎకరానికి నీళ్ల రాలేదని అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడటం చూస్తే ఆయన ఆ పదవికి అర్హుడు కాదని తేలిపోయిందన్నారు. మూడు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండినవి ఆయన కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రాజెక్టుల వద్ద ఉన్న టన్నెల్‌ల మీద, పంపుహౌజ్‌ల వద్ద ఏం పనులు పెండింగ్‌లో ఉన్నాయో, ఏం జరుగుతుందో రెండేళ్ల కాలంలో ఒక్కసారైనా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ ప్రాంతంలో పర్యటించి సమీక్షించారా? అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో నిర్మించిన మిడ్‌మానేర్‌కు బుంగపడిందని, దేవాదుల పాడైపోయిందని సుందిల్ల, ఎస్సారెస్పీ అన్నీ కూడా దెబ్బతిన్నాయని, సింగూరు గేట్లు పాడైపోయి రెండేళ్ల అవుతున్నా రిపేరు చేయడానికి ప్రభుత్వానికి చేతకావడం లేదని ఆరోపించారు. మేడిగడ్డ వద్ద నాలుగు పిల్లర్లు కుంగితే రూ. 200 కోట్లు ఖర్చు చేస్తే మళ్లీ నిర్మాణం చేపట్టవచ్చని, అలా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. అనంతరం మల్లన్నసాగర్ కట్టపైన గోదావరి నీటిలో పూలు, సారె సమర్పించి గోదావరి జలాలతో కేసీఆర్ ఫ్లెక్సీకి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తొగుట మండలం తుక్కాపూర్‌లో మల్లన్నసాగర్ కట్టపై బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

అందెశ్రీ విన్నపం.. సీఎం ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

- రేబర్తి పాఠశాలకు కొత్త శోభ

మద్దూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ కవి, రచయిత అందెశ్రీ విన్నపం మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. రేబర్తి విద్యాభివృద్ధికి కృషి చేయాలని అందెశ్రీ విన్నపంపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఈడబ్ల్యూఐడీసీ) ఎండీ గణపతిరెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి సూచనలతో బుధవారం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి తన బృందంతో కలిసి రేబర్తి పాఠశాలను సందర్శించారు. ఈ బృందం పాఠశాలలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కావాల్సిన వసతులు, అభివృద్ధి పనులపై స్థానిక ఎంఈవో వరదరాజుతో చర్చించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రేబర్తి పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యను కొనసాగించడానికి అభ్యంతరాలు లేకుండా చూడాలని అందెశ్రీ సూచించారన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న 5 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో భాగంగా రేబర్తి పాఠశాలను అప్‌గ్రేడ్ చేసే అంశం తమ పరిధిలో లేనందున, దీనిపై ప్రభుత్వానికి లేఖ రాయాలని ఎంఈవో, ఉపాధ్యాయులకు సూచించినట్లు తెలిపారు. అలాగే, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పూర్తి అంచనాలను సిద్ధం చేసి, ఆ నివేదికలను కలెక్టర్‌తో పాటు ఈడబ్ల్యూఐడీసీ ఎండీకి అందజేస్తామని ఆయన వివరించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగరాజు, అసిస్టెంట్ ఇంజినీర్లు షఫీ, నాగరాజు, రాజా అందెశ్రీ చిన్ననాటి మిత్రులు బొమ్మగాని శివయ్యగౌడ్, స్థానిక నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ కూరెళ్ల నిర్మల, కాంట్రాక్టర్ దిడిగం రాజేష్ పాల్గొన్నారు.



రేబర్తి పాఠశాలలో ఉపాధ్యాయులతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బృందం సభ్యులు

జనగామ నియోజకవర్గంలోనే కొనసాగించాలి : అందెశ్రీ

ఈ విషయమై బుధవారం అందెశ్రీ 'ఆంధ్రజ్యోతి' విలేకరితో ఫోన్‌లో మాట్లాడారు. పూర్వపు వరంగల్ జిల్లాలో ఉన్న మద్దూరు మండలాన్ని జిల్లాల పునర్విభజనలో భాగంగా జనగామ జిల్లాలో కొనసాగిస్తున్నప్పటికీ, దానిని ముక్కలు చేసి సిద్దిపేట జిల్లాలో కలపడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంత ప్రజల అభీష్టం మేరకు మద్దూరు మండలాన్ని జనగామ జిల్లాలోనే కొనసాగించాలని సీఎంకు విన్నవిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే నిజాం విముక్తి పోరాటంలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన వీర బైరాన్‌పల్లి అభివృద్ధి, పాఠశాలల్లో చారిత్రక పుస్తకాల ఏర్పాటుకు సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అందెశ్రీ తెలిపారు. తన విన్నపంపై సీఎం స్పందించి, తన స్వగ్రామమైన రేబర్తిలో విద్య అభివృద్ధికి తోడ్పాటు అందించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని, ఇది తన ఊరికి ప్రాణం పోసినట్లుగా ఉందని అందెశ్రీ పేర్కొన్నారు.

బీజేపీతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కు

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, నాయకులు దేవిప్రసాద్, పల్లె రవికుమార్

సిద్దిపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న కుట్ర రాజకీయాల్లో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పార్టీ నాయకులు దేవిప్రసాద్, పల్లె రవికుమార్, బాలరాజు స్పష్టం చేశారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజ్ మాత్రమే కాదని, అది 20 రిజర్వాయర్ల సమూహమని వారు చెప్పారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగిపోయిన అంశాన్ని విష ప్రచారం చేస్తూ కేసీఆర్, హరీశ్ రావు ప్రతిష్ఠను దెబ్బతీయడం ద్వారా బీఆర్ఎస్‌ను నిలువరించాలని కాంగ్రెస్, బీజేపీ కలిసి చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్

కేసీఆర్ ఒక సాధారణ రాజకీయ నాయకుడు కాదని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత అని వారు మర్చిపోతున్నారని తెలిపారు. గోదావరి నదికి 560 మీటర్ల ఎత్తులో ఉన్న సిద్దిపేట ప్రాంతానికి ఈ ప్రాజెక్టులో చిట్టచివరి ప్రాంతమైన కొండపోచమ్మసాగర్‌కు నీళ్లను ఎత్తిపోసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన చరిత్ర కాళేశ్వరం ప్రాజెక్టుదని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేసీఆర్ తన మేధస్సునంతటినీ ఉపయోగించగా, అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ నిద్రాహారాలు మాని ప్రాజెక్టులను నిర్మించడంలో, రైతులకు నీళ్ల అందించడంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా, ఎంత విషప్రచారం చేసినా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చిన గోదావరి జలాలతో లక్షలాది ఎకరాల్లో పంటలు పండించిన రైతులకు వాస్తవాలు ఏమిటో తెలుసన్నారు. నిండుకుండల్లా ఎప్పుడు జలకళను సంతరించుకొని, గోదావరి జలాలతో కళకళలాడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన రిజర్వాయర్‌లే అందుకు సజీవ సాక్ష్యమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, దేవి ప్రసాద్, పల్లె రవికుమార్, బాలరాజు స్పష్టం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్

ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం



సిద్దిపేట ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) కార్మికుల సంక్షేమ పథకాలను రెట్టింపు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, అందుకు కృషిచేసిన మంత్రి వివేక్, బీఎస్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని బీఎస్ఆర్‌కెఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమెల రాములు తెలిపారు. కార్మికుల సంక్షేమ పథకాలను రెట్టింపు చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ వారి ఫ్లెక్సీలకు కార్మికులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పించన్లు, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుతో పాటు శాశ్వతంగా లేబర్ కార్డు ఉండాలని, ఇళ్ల లేని కార్మికులకు గూడు కల్పించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం


సురేష్(ఫైల్)

టేక్మాల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి భర్త ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం, టేక్మాల్ మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన మడ్డె సురేష్(26)కు, సునితకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. సురేష్ అల్లాదుర్గం సర్కిల్‌లోని 108లో విధులు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల క్రితం ఉద్యోగం నిమిత్తం వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. దీంతో భార్య సునితఇన్ని రోజులు ఎక్కడికి వెళ్లావు అని అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సెప్టెంబరు 2న సాయంత్రం సురేష్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద వెతికినా అతని ఆచూకి లభించలేదు. దీంతో బుధవారం భార్య సునిత టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి పట్టివేత

జహీరాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా 140 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు హనుమంతు, అనుదీప్ తెలిపారు. పట్టణ సమీపంలోని అల్గోల్-అల్లా రోడ్డుపై వాహనాల తనిఖీలు చేపట్టగా, సత్వార్‌కు చెందిన మహ్మద్ ఖయ్యూం, ఫకీర్ అయ్యూబ్ స్కూటీపై గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. గంజాయిని, స్కూటీని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరుచోట్ల నలుగురు వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు. ఒకరు ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుంటే, మిగతవారు మద్యానికి బానిసై, కుటుంబ కలహాలు, అక్రమ సంబంధం కారణంగా బలవన్మరణం పొందారు.

ఆర్థిక ఇబ్బందులతో..

రామచంద్రాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బీహెచ్ఈఎల్ ఎంఐజీ ఫేజ్-2 కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం, ఎంఐజీలో నివసించే మహేష్(37) చిరువ్యాపారాలు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మానసికంగా బాధపడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం భార్య, కూతురు గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమంలో ఉండగా, మహేష్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై..

దుబ్బాక, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట వార్డుకు చెందిన ఒక వ్యక్తి మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బూరు మల్లేశం(61) కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య శ్యామల, కుమారుడు, ఇద్దరు కూతుళ్లున్నారు.

కుటుంబ కలహాలతో యువతి..

కౌడిపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తరుచూ గొడవలు పడుతుండటంతో జీవితంపై విరక్తి చెంది యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మహ్మద్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ రంజితరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, మహ్మద్‌నగర్‌కు చెందిన బండల శమంత, మైసయ్య దంపతులు తరుచూ గొడవ పడుతున్నారు. మంగళవారం సాయంత్రం తల్లిదండ్రులు గొడవ పడుతుండగా వారి కూతురు అక్షిత(21) వారిని ప్రశ్నించి, క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి చున్నీతో ఉరి వేసుకుంది. తల్లిదండ్రులు గమనించి ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహేతర సంబంధంపై మందలించినందుకు ..

హవేళిఘణపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం వద్దని మందలించడంతో వివాహిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, నాగాపూర్ గ్రామానికి చెందిన ఎల్లయ్య భార్య కళ్యాణి(28) అదే గ్రామానికి చెందిన సంతోష్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. గత నెల 29న ఇంట్లో కళ్యాణి ఓ వ్యక్తితో కనిపించడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో పురుగుల మందు తాగింది. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందింది. సంతోష్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త ఎల్లయ్య ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

రామాయంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట-హైదరాబాద్ హైవేపై వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. మృతుడికి సుమారు నలభై ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిస్తే రామాయంపేట పోలీస్ స్టేషన్ (8712657934)కు సమాచారం ఇవ్వాలని ఎస్సై బాల్‌రాజ్ కోరారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి..

పటాన్‌చెరు సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దైవదర్శనానికి పాదయాత్ర చేస్తుండగా వాహనం ఢీ కొని దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డిజిల్లా పిట్లం మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన శివకాంత్ (32) భార్య రమ్యతో కలిసి ఐదేళ్ల క్రితం ఇస్నాపూర్ మున్సిపల్ పట్టణంలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. బుధవారం రుద్రారం గణేష్‌గడ్డ ఆలయ దర్శనానికి స్నేహితుడు అంబారి రాజులు పాదయాత్ర చేస్తూ ఇస్నాపూర్ నుంచి రుద్రారం వెళ్తున్నారు. మార్గమద్యలో ఎంఎస్ఎన్ పరిశ్రమ వద్దకు వచ్చే సమయానికి వెనుకనుంచి డీసీఎం వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలయి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. భార్య రమ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ..


రాజు మృతదేహం

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు శివారులోని పౌల్ట్రీ ఫాం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వరంగల్ రూరల్ జిల్లాకు చెందిన రాజు (26) పది రోజుల క్రితం పుల్లూరులోని పౌల్ట్రీ ఫాంలో పనిలో చేరాడు. బుధవారం పౌల్ట్రీ ఫాం చుట్టూ పరదాలు కడుతుండగా, అతను పట్టుకున్న ఇనుప నిచ్చెన సింగిల్ ఫేజ్ డీటీఆర్‌కు తగిలింది. దీంతో విద్యుత్ షాక్ గురై రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఒక కూతురు ఉన్నారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

పటాన్‌చెరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో పండ్ల వ్యాపారం చేసే రిజ్వాన్(20) గత నెల 18న రాత్రి స్నేహితులతో కలిసి కారులో వచ్చి రుద్రారం శివారులోని ఓ దాబాలో భోజనం చేసి తిరుగు ప్రయాణంలో పటాన్‌చెరు వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కారు పల్టీలు కొట్టడంతో రిజ్వాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి హమీద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మునిపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కంకోల్ టోల్ ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ నుంచి గుజరాత్‌కు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు బుధవారం సమాచారం వచ్చింది. ఈ మేరకు వాహనాల తనిఖీలు చేస్తుండగా ఓ లారీలో రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో లారీని, 300 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కేరళ బృందం

మహిళా శక్తి క్యాంటీన్ పథకం భేష్

● కేరళ కుటుంబశ్రీ ఎన్ఆర్‌వో నిర్వాహకురాలు శ్యామల

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కేరళ రాష్ట్రానికి చెందిన కుటుంబశ్రీ నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్ (ఎన్ఆర్‌వో) నిర్వాహకురాలు శ్యామల బుధవారం సందర్శించారు. ఇందిరా మహిళా శక్తి పేరిట మహిళలు స్వయంగా ఉపాధి పొందే తీరును ఆమె పరిశీలించి, ఈ పథకం అమలును ప్రశంసించారు. అంతకుముందు ఆమె క్యాంటీన్ కిచెన్‌తో పాటు మహిళా నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం డీఆర్‌డీవో జ్యోతిని కలిసి పథకం అమలు తీరును తెలుసుకున్నారు. ఆమె వెంట డీపీఎంలు రమేశ్‌బాబు, కిన్నెడి, ఏపీఎం వెంకట్, సీసీలు శ్రవణ్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

బస్సులో దొరికిన నల్లపూసల దండను బాధితులకు అప్పగింత



నల్లపూసల దండను అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

దుబ్బాక, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో మంగళవారం ఒక ప్రయాణికుడు మరిచిపోయిన రూ.70 వేల విలువైన నల్లపూసల దండను తిరిగి అప్పగించిన సంఘటన దుబ్బాక డిపోలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి: నారాయణఖేడ్ నుంచి పటాన్‌చెరు వరకు ప్రయాణించిన ఒక వ్యక్తి తన బ్యాగును బస్సులో మరిచిపోయాడు. కొంతసేపటికి డ్యూటీలో ఉన్న కండక్టర్ రాజేశం బ్యాగును గమనించి, దానిని తెరిచి చూడగా నల్లపూసల దండ కనిపించింది. విషయాన్ని డిపో అధికారులకు తెలిపారు. డ్యూటీ అయిపోయిన తర్వాత కండక్టర్, డ్రైవర్ శ్రీనివాస్ కలిసి బ్యాగును అధికారులకు అప్పగించారు. బ్యాగు పోగొట్టుకున్న పవన్ కుమార్ అనే ప్రయాణికుడు తన టికెట్ ఆధారంగా డిపో అధికారులకు ఫోన్ చేసి, డిపోకు వచ్చాడు. అతని వివరాలు తెలుసుకుని నిర్ధారించుకున్న తర్వాత డిపో ఇన్‌చార్జి కనకలక్ష్మి, కంట్రోలర్లు లోహిత్‌రావు, నారాయణ కలిసి ఆ దండను అతనికి అప్పగించారు. విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించిన కండక్టర్ రాజేశం, డ్రైవర్ శ్రీనివాస్‌ను డిపో మేనేజర్ రఘు, ఇన్‌చార్జి కనకలక్ష్మి అభినందించారు.

మేకల దొంగ అరెస్ట్



నిందితుణ్ని చూపెడుతున్న టూ టౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మేకల దొంగను బుధవారం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్‌కు చెందిన ఒక్లేపు శేఖర్ ఈ నెల 2న రాత్రి తన ఐదు మేకలను నిరుపయోగంగా ఉన్న బాత్‌రూంలో ఉంచి పడుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి మేకలు లేకపోవడంతో టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం సిద్దిపేట అంగడిలో వెతుకుతుండగా సిద్దిపేట డబుల్ బెడ్ రూమ్ కాలనీకి చెందిన ఒర్సు కృష్ణ ఐదు మేకలను అమ్మడానికి వచ్చి అనుమానాస్పదంగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొని విచారించగా, మేకలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి ఐదు మేకలను స్వాధీనం చేసుకున్నారు.

క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీల్లో సంగారెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు బి. కృష్ణ, సయీద్ అన్వర్ ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. సెప్టెంబరు 2న హైదరాబాద్‌లోని కోఠిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు ఈ బహుమతిని సాధించారు. వారిని ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకుడు రవికుమార్ అభినందించారు. వీరు బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.



బిందెల బండి

బరువు తక్కువగా ఉన్నప్పటికీ బులేరో వాహనంపై పెద్ద ఎత్తున ప్లాస్టిక్ బిందెలను ఇలా విక్రయానికి తీసుకెళ్లడం చూపరులను ఆకట్టుకున్నది. నారాయణఖేడ్ వైపు వస్తుండగా ప్రజలు ఆసక్తిగా చూశారు.
- నారాయణఖేడ్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి)



చౌటకూర్‌లో యూరియా బస్తాల కోసం బారులు తీరిన రైతులు



తూప్రాన్ మండలం యావాపూర్ వద్ద రాస్తారోకో

యూరియా కోసం పాట్లు

● ఒక్కో బస్తాపై అదనంగా రూ.40 వసూలు

పుల్‌కల్/గజ్వేల్/మద్దూరు/దుబ్బాక/తూప్రాన్/శివ్వంపేట/సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూరియా బస్తాల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే అదునుగా కొందరు ఒక్కో బస్తాపై రూ.40 అదనంగా తీసుకుంటుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. బస్తాకు రూ.266.50 తీసుకోవాల్సి ఉండగా బుధవారం చౌటకూర్‌లో రూ.300 నుంచి రూ.310 తీసుకున్నట్లు రైతుల తెలిపారు. గజ్వేల్ పట్టణంలో యూరియా కోసం రైతులు మరోసారి రోడ్డెక్కారు. తూప్రాన-గజ్వేల్ రోడ్డుపై ధర్నాకు దిగారు. గంట పాటు ఆందోళన తర్వాత, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ అక్కడికి చేరుకుని గురువారం యూరియాను సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నాను విరమించుకున్నారు. మద్దూరు, ధూళిమిట్ట మండలాల రైతులు బుధవారం రాత్రి నుంచే యూరియా కోసం పడిగాపులు కాశారు. దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేపట్టారు. రైతులు క్యూలైన్‌లో చెప్పులను ఉంచారు. తూప్రాన్-గజ్వేల్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. శివ్వంపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు యూరియా కోసం ద్విచక్ర వాహనంపై శివ్వంపేట వచ్చారు. యూరియా దొరకకపోవడంతో తిరిగి వెళ్తుండగా, పెట్రోల్ బంక్ సమీపంలో బొలెరో వాహనం వారిని ఢీకొట్టడంతో గాయపడ్డారు.

కొరత లేకుండా చూడండి : సంగారెడ్డి ఎమ్మెల్యే

రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి విన్నవించారు. అనంతరరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సదాశివపేట ఏవో రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడి యూరియా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



సిద్దిపేట రూరల్ : లబ్దిదారుకు చెక్కు అందజేస్తున్న ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్

అక్షరాస్యతతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టం

● ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్

వర్గల్/సిద్దిపేట రూరల్ , సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యతతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టమవుతుందని ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ అన్నారు. బుధవారం వర్గల్ మండలం గౌరారంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకు వినియోగదారులకు, మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక నైపుణ్యతను పెంపొందించేందుకు ఆర్బీఐ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఫోన్‌లో వచ్చిన అనవసరమైన లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఇతరులకు చెప్పవద్దని అవసరమైతే బ్యాంకు అధికారులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా నారాయణరావుపేట మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్యాంకు వినియోగదారులకు, రైతులకు, మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ బ్యాంకు రుణాలు, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక రక్షణ, బీమా వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్బీఐ జనరల్ మెనేజర్ సుప్రభాత్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గోమతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఉదయ్ కిరణ్ , యూబీఐ డీజీఎం అరవింద్, రిజనల్ హెడ్ శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్లు మహేందర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సాంకేతిక తోడ్పాటు హర్షణీయం



ఐఐటీహెచ్‌లో హ్యాకథాన్ పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

● ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో విద్యార్థుల సాంకేతిక తోడ్పాటు హర్షణీయమని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. బుధవారం ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో కేంద్ర ఆర్థిక సేవల విభాగం కందిలోని ఐఐటీహెచ్‌లో ఫినషీల్డ్ హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే-2025 పోటీలను నిర్వహించారు. మొబైల్ ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో మోసాలను అరికట్టడం, సైబర్ సెక్యూరిటీ సవాళ్లను పరిష్కరించడం వంటి అంశాలపై ఈ పోటీలు జరిగాయి. దేశవ్యాప్తంగా 661 బృందాలు దరఖాస్తు చేసుకోగా, 72 టీమ్‌లను ఎంపిక చేశారు. ఐఐటీహెచ్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన 4 టీమ్‌లకు రూ.20లక్షల బహుమతులను అందజేశారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు



విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న జానులిరి

కుకునూరుపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ క్రీడలు బుధవారం ముగిసాయి. చివరి రోజు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫోక్ డ్యాన్సర్ జానులిరి హాజరయ్యారు. ఆమె విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ముందుగా ఎంఈవో సత్తయ్య మాట్లాడుతూ చదువతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. పోల్కంపల్లి నరేందర్ లకుడారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులకు గాను రూ. 10వేలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, శ్రీనివాస్‌రెడ్డి, కోల సద్గుణ, మల్లం ఐలయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి గారూ.. జర ఇటు చూడండి

● సమస్యలను తెలుపుతూ బ్యానర్ ఏర్పాటు



తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన బ్యానర్

రామచంద్రాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ పలుమార్లు నిరసనలు తెలిపింది. అయినా ఫలితం లేకపోవడంతో, వారు ప్రధాన సమస్యలను బ్యానర్లపై ముద్రించి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సందర్శించాలంటూ ఆహ్వానిస్తూ పట్టణం ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్ల పక్కన సెల్ఫీలు దిగిన స్థానికులు, సమస్యల వల్ల పడుతున్న ఇబ్బందులను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రధానంగా పదేళ్ల క్రితం ప్రారంభమైన రేడియల్ రోడ్డు పూర్తి కాకపోవడం, స్వచ్ఛమైన తాగు నీరు లేకపోవడం, విద్యుత్ అంతరాయాలు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, అంతర్గత రోడ్లు లేకపోవడం, ఎస్టీపీ ప్లాంట్లు లేకపోవడంతో మురుగునీరు నేరుగా చెరువుల్లోకి వెళ్లడం వంటి సమస్యలను బ్యానర్లలో పేర్కొన్నారు. ఇప్పటికే వేల మంది తమ అభిప్రాయాలను సోషల్ మిడీయాలో పొందుపర్చారని తెనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ తెలిపారు.

మాకు న్యాయం చేయండి

● ప్రధాన రహదారిపై నిర్వాసితుల ధర్నా



ధర్నా చేస్తున్న అప్పాజీపల్లి రైతులు

కొల్చారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెదక్-హైదరాబాద్ 765డి జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని అప్పాజీ పల్లి గ్రామస్థులు బుధవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణంలో మూలమలుపులు సరి చేయడానికి అధికారులు రైతుల నుంచి భూమిని సేకరించారు. అప్పటి ఎమ్మెల్యే మదన్ రెడ్డి గ్రామసభ నిర్వహించి, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పక్కనే ఉన్న భూమిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు ఆ హామీ నెరవేరలేదు. మంగళవారం రెవెన్యూ అధికారులు సంబంధిత భూమిలో ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి డిప్యూటీ తాసిల్దార్ నాగవర్ధన్, గిర్దవర్ ప్రభాకర్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై అహ్మద్ మోహిద్దీన్ చేరుకొని ఆందోళనకారులను సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించుకున్నారు. అనంతరం రైతులు తాసిల్దార్ శ్రీనివాస్ చారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకట్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాచగిరి క్షేత్రం వద్ద వైభవంగా గణపతి హోమం



వర్గల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో వినాయక నవరాత్రోత్సవాలలో భాగంగా బుధవారం ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ ఆధ్వర్యంలో, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో వేద పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య హోమాది కార్యక్రమాలు అత్యంత వైభవంగా చేశారు. ఈ వేడుకలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. గణేశ్ నిమజ్జనం కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించనున్నట్లు చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు సురేందర్‌రెడ్డి, చంద నాగరాజు, కొత్తపల్లి శ్రీనివాస్, గాలి కిష్టయ్యతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడి.. నలుగురికి తీవ్ర గాయాలు



పుల్‌కల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తానపూర్ గ్రామంలో బుధవారం పిచ్చి కుక్క దాడి చేసిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కుమ్మరి రామమ్మ, గంట దుర్గమ్మ, చాకలి మల్లమ్మ, ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన మరో వ్యక్తి హనుమాన్ ఆలయం వద్ద నిలబడి ఉండగా అటుగా వెళ్తున్న పిచ్చి కుక్క దాడి చేసింది. ఈ సంఘటనలో నలుగురి కాళ్లకు గాట్లు పడ్డాయి. వీరిని ప్రథమ చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. క్రమం తప్పకుండా ప్రతి రోజు ఆసుపత్రికి వచ్చి టీకాలు వేసుకోవాలని వైద్యులు సూచించారు. కాగా, ఆసుపత్రికి వెళ్లేందుకు క్షతగాత్రులకు గ్రామ మాజీ ఉప సర్పంచ్ గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

ద్విచక్ర వాహనం దహనం

గుమ్మడిదల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టిన సంఘటన గుమ్మడిదల మండలం వీరారెడ్డి పల్లి లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి కథనం ప్రకారం వీరారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల కిరణ్‌కు చెందిన ద్విచక్ర వాహనానికి మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. దాని విలువ సుమారుగా రూ.30 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. తన ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టిన దుండగులు పైన చర్యలు తీసుకోవాలని ఎర్రోళ్ల కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరికి జైలు శిక్ష

జోగిపేట రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైనందుకు గాను నిందుతుడికి మూడు నెలల జైలు శిక్ష పడిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల మేరకు సంగారెడ్డి జిల్లా చిద్రుప్ప గ్రామానికి చెందిన నర్సింహులు తన కూతురిని 31 మే 2015లో జోగిపేటలో పాలిటెక్నిక్ పరీక్ష రాసేందుకు తీసుకొచ్చాడు. పరీక్ష అనంతరం తిరుగు ప్రయాణంలో ఉండగా కారు వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టగా నర్సింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అప్పటి నుంచి విచారణ కొనసాగగా గురువారం తీర్పు వెలువడింది. నిందితుడు బైరి సత్యనరేందర్‌కు కోర్టు మూడు నెలల జైలు శిక్ష విధించినట్లు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.

తండాల అభివృద్ధి పట్టదా?

- వేధిస్తున్న నిధుల కొరత
- నిధులు కేటాయించాలని గ్రామస్థుల డిమాండ్

నంగునూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిన్న గ్రామాల ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని గత ప్రభుత్వ హయాంలో తండాలను పంచాయతీలుగా మార్చి అభివృద్ధిని మాత్రం విస్మరించారు. గ్రామపంచాయతీలకు దూరంగా ఉన్న తండాలను ప్రత్యేక పంచాయతీలుగా మారిస్తే ఎంతో అభివృద్ధి సాధించవచ్చు అని గ్రామస్థులు ఆశించారు. కానీ వారి ఆశలు ఆదిలోనే అడియాశలు అయ్యాయి. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని బద్దిపడగ, పాలమాకుల గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న జేపీ తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా మార్చారు. గ్రామపంచాయతీ ఏర్పాటయ్యాక ఒక ప్రభుత్వ పాఠశాల , సీసీ రోడ్లు తప్ప జరిగిన అభివృద్ధి అంటూ ఏమి లేదని గ్రామస్థులు తెలిపారు. గ్రామపంచాయతీగా ఏర్పడి ఒక టర్మ్ సర్పంచ్ పదవీ కాలం కూడా ముగిసిపోయినప్పటికీ అక్కడ పంచాయతీ పక్కా భవనం నిర్మించకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధిలేని పరిస్థితిలో పురాతన పాఠశాల భవనంలో అరకొర వసతుల మధ్య గ్రామపంచాయతీ నిర్వహణ సాగుతుంది. పంచాయతీలు ఏర్పాటయితే గ్రామానికి డబుల్ బెడ్ రూమ్‌లు వస్తాయని ఎంతో ఆశించారు. కానీ ఒక్కటి కూడా మంజూరు కాకపోవడంతో నిరాశలకు లోనయ్యారు. జేపీ తండాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం ఎన్ఆర్ ఈజీఎస్ కింద రూ.20 లక్షలు మంజూరవడంతో 12సెప్టెంబర్ 2023న మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కొద్ది రోజుల్లోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంలో ఇచ్చిన ప్రొసీడింగ్ రద్దు చేయడంతో పనులు నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వం తండాలపై చిన్న చూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తుందని తండావాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తండాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.



నంగునూరు మండలం జేపీ తండాలో గ్రామపంచాయతీ కోసం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలి



గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని గ్రామానికి దూరంగా ఉన్న తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా మార్చింది. గత ప్రభుత్వ సహకారంతో గ్రామంలో పాఠశాల భవనం, డంపింగ్ యార్డు, వాటర్ ట్యాంక్, స్మశాన వాటిక, సీసీ రోడ్లు నిర్మాణం జరిగినప్పటికీ గ్రామపంచాయతీకి కేటాయించిన నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దు చేయడంతో పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తండాలను అభివృద్ధి పరచాలి.

-భిక్షపతి నాయక్, మాజీ సర్పంచ్

అధికారుల నిర్లక్ష్యం రైతులకు నష్టం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిషన్‌భగీరథ అధికారుల నిర్లక్ష్యంతో రైతుల పంటలు దెబ్బతిన్నాయని వెంటనే నష్టపరిహారం అందజేయాలని కొండపాక మాజీ వైస్ ఎంపీపీ దేవి ర వీందర్ డిమాండ్ చేశారు. బుధవారం దెబ్బతిన్న పంటలను రైతులతో కలిసి దేవి రవీందర్ , బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంగోల్ పంప్‌హౌజ్ వద్ద గ్యాస్ లీక్ అవడం వల్ల దాదాపు 20 మంది రైతులు దాదాపు 40 ఎకరాల పత్తి, వరి పంటను నష్టపోయారని, ఎకరాకి రూ. 50వేల నష్టపరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్లనే రైతులు పంటలను నష్టపోయారని వారు వాపోయారు. దెబ్బతిన్న పంటలను పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ హైమావతితో రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

ఇంజనీరింగ్ కళాశాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలంలోని కిషన్ నగర్ వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారికోసం బుధవారం నుంచి హుస్నాబాద్ బస్ స్టేషన్ నుండి బస్సు సౌకర్యం ఆర్టీసీ అధికారులు కల్పించారు.

కల్వకుంట్ల కుటుంబం జైలుకెళ్లడం ఖాయం

సిద్దిపేట సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరిగిన లక్ష కోట్ల రూపాయల అవినీతిలో కల్వకుంట్ల కుటుంబం జైలుకెళ్లడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని 9వ వార్డులో రూ. 28 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకుడు పూజల హరికృష్ణ, అత్తుఇమామ్ శంకుస్థాపన చేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరంలో అవినీతి జరిగినందుకే సీఎం రేవంత్‌రెడ్డి రిటైర్ జడ్జి ఘోష్‌తో కమిటి వేసి విచారణ జరిపించారన్నారు. ఈ మేరకు శాసనసభలో తీర్మానం చేసి, సీబీఐతో విచారణ చేయించాలని కేంద్ర ప్రభుత్వానికి అప్పగించినట్లు చెప్పారు. కాళేశ్వరంలో అవినీతి చేయనప్పుడు సీబీఐ అంటే బీఆర్ఎస్‌కు భయమెందుకని, కాళేశ్వరంలో తప్పు చేయకుంటే విచారణను ఎదుర్కోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినదానిపై బాధ్యులైన వారిని నిలదీయాల్సిన బీఆర్ఎస్ నాయకులు మతి భ్రమించి సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటుని చెప్పారు. సీబీఐ విచారణకు వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో వారి దుకాణం మూసుకోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. మరోసారి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను, కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.


సిద్దిపేట పట్టణంలోని 9వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పూజల హరికృష్ణ, అత్తుఇమామ్

10 గంటలు శ్రమించి 6 కిలోల కణితి తొలగింపు

ములుగు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం లక్ష్మక్కపల్లి సమీపంలోని ఆర్‌వీఎం ఆసుపత్రిలో బుధవారం అరుదైన ఆపరేషన్ చేశారు. ఓ మహిళ కడుపులో ఉన్న ఆరు కిలోల కణితిని, డాక్టర్లు 10 గంటల పాటు శ్రమించి ఆపరేషన్ చేసి తొలగించారు. ఆర్వీఎం ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం కేశవనగర్ కాలనీలో నివసించే ప్రమీల(37) పొట్టలో పెరుగుతున్న కణితితో బాధపడుతూ, అనేక ఆసుపత్రులను సంప్రదించారు. అయితే అధిక ఖర్చులు కారణంగా చికిత్స సాధ్యపడలేదు. వారికి ఆరోగ్య పథకం కింద ములుగు మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో గల ఆర్‌వీఎం ఆసుపత్రిని ఆశ్రయించింది. ఆమెకు వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించారు. ఆరు కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు. 10 గంటలపాటు శస్త్రకిత్స చేసి విజయవంతంగా తొలగించినట్లు తెలిపారు. ఈ శస్త్ర చికిత్స ఖర్చుకు రూ. 10లక్షలు కాగా, ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రమీల ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు.

విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క 'ఏఐఎస్ఎఫ్'



చేర్యాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చేర్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థి ఉద్యమాల వేగుచుక్కగా ఏఐఎస్ఎఫ్ పోరాడి అగ్రగామిగా నిలిచిందని ఆ యూనియన్ మాజీ రాష్ట్ర నాయకుడు మంద పవన్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 90వవారోత్సవాల ముగింపుసభ బుధవారం చేర్యాలలోని వాసవీగార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమరశీల ఉద్యమాలకు ఊపిరిపోసి దేశ స్వాతంత్ర్యపోరాటంలో విద్యార్థులను ఏకం చేసి బ్రిటీష్ మూకలను తరిమి కొట్టడంలో కీలకభూమిక పోషించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ పోరాటం వరకు ప్రత్యేక ఉద్యమాన్ని కొనసాగించిన ఏకైక విద్యార్థి సంఘమన్నారు. బడుగు, బలహీనవర్గాలతో పాటు పేదవిద్యార్థులకు సమగ్ర విద్యనందించడంతో పాటు విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. విద్య అంగడి సరుకు కాకుండా సమాన విద్యశాస్త్రీయవిద్యనందించేంత వరకు విశ్రమించబోమన్నారు. అంతకుముందు స్థానిక పాతబస్టాండ్ నుండి పట్టణ శివారులోని సభా ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు.

ఇసుక మేటలతో పంటలకు తీవ్ర నష్టం

దౌల్తాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలకు అన్నదాతలకు ఒక వైపు సంతోషం మరోవైపు తీవ్ర నష్టం కలిగించింది. దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట క్లస్టర్‌లో గాజులపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు చెరువులు కుంటలు పొంగడంతో వరి పొలాల్లో ఇసుక మెట్టలు పెట్టాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఏఈవో సంతోష్ గాజులపల్లి గ్రామంలో ఇసుక మేటలు పెట్టిన వరి పొలాలను పరిశీలించారు. గాజులపల్లిలో సుమారుగా 30 ఎకరాల వరి పొలాల్లో ఇసుక మెట్టలు పెట్టాయని ప్రాథమికంగా అంచనా వేశామని ఏఈవో సంతోష్ తెలిపారు.

సాఫీగా సాగేదెలా?

(5వ పేజీ తరువాయి)

ఈ మేరకు సిద్దిపేట జిల్లాలో రహదారుల నష్టంపై, ప్రభుత్వానికి త్వరలోనే నివేదిక అందించేందుకు నివేదికను సైతం సిద్ధం చేస్తున్నారు.

మరమ్మతులకు మరికొంత సమయం

సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షాకాలం ఉంటుంది కాబట్టి దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు జరగాలంటే మరో నెల ఆగక తప్పదని అధికారులు భావిస్తున్నారు. ఇప్పుడు ప్యాచ్‌వర్క్ చేసినా మళ్లీ వర్షాలు కురిస్తే అవి మరింత దెబ్బతినే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో భారీ గుంతల్లో మట్టి, మొరం నింపి తాత్కాలికంగా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. వాహనదారులు రాత్రిపూట జాగ్రత్తగా ప్రయాణించాలని సూచిస్తున్నారు.


సిద్దిపేట పట్టణంలోని ఎన్సాన్‌పల్లి చౌరస్తాలో ధ్వంసమైన రోడ్డు


అక్బర్‌పేట-భూంపల్లిలోని రుద్రారంలో ధ్వంసమైన రోడ్డు


రాంపూర్ గ్రామంలో ఏర్పడిన గుంత

ఉద్యోగ భద్రత కల్పించాలి

నంగునూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ నెల, నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ముందు బుధవారం ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు రాజమౌళి మాట్లాడుతూ కార్మికులకు నెల నెల వేతనాలు అందక పస్తులుండే కాలం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు చెల్లించాల్సిన జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతి నెల గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు ఒకటో తేదీన చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

మర్కుక్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రీడలను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ క్రీడలు నిర్వహిస్తామని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అందులో భాగంగానే మండల విద్యాధికారి వెంకటరాములు ఆధ్వర్యంలో నేటి నుంచి మండల స్థాయి అండర్ 14, అండర్ 17 విభాగాల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బుధవారం మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్ కేంద్రంగా ఎస్‌జీఎఫ్ క్రీడలు ఘనంగా ప్రారంభించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి


గజ్వేల్ పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని బసవేశ్వర విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ శవయాత్రను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పెండింగ్‌లో ఉన్న రూ.8200 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేస్తామని గొప్పలు చెప్పి గద్దెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 21నెలలు గడుస్తున్నా కనీసం రాష్ట్రంలో విద్యాశాఖకు విద్యాశాఖ మంత్రిని నియమించడం లేదన్నారు. విద్యాశాఖను స్వయంగా చూసుకుంటానని అని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి పేద, మధ్య తరగతి విద్యార్థులు కనబడడం లేదని, ఆరు ఏళ్లుగా స్కాలర్‌షిప్, రీయంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎంఆర్ఎంఏ కింద పంటలపై అవగాహన

కోహెడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో మేరా రేషమ్ మేరా అభిమాన్ (ఎమ్మార్ ఎంఏ) ప్రచారం కింద రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి సీఎస్-బీఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ కుమార్ మల్బరీతోట, నాణ్యత, ఆకు నిర్వహణ పద్ధతులు అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఎస్ శాస్త్రవేత్త ఇంద్ర సేనా రెడ్డి పట్టు పురుగుల పెంపకం, సామర్థ్యంపై ప్రసంగించారు. అలాగే మరోశాస్త్రవేత్త డాక్టర్ జి. రాఘవేందర్ పట్టు పురుగు తెగులు, వ్యాధి నిర్వహణ పద్ధతులుపై చర్చించి వివరించారు.

మృతుడి కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పరామర్శ

చిన్నకోడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మేనల్లుడు చిన్నకోడూరుకు చెందిన జంగపల్లి మణివర్మ (25) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మృతుడి ఫ్లెక్సీకి నివాళులర్పించారు. మృతి చెందిన యువకుడి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

మోతెలో ఉచిత కంటి వైద్యశిబిరం

మిరుదొడ్డి,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో బుధవారం ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆసుపత్రి వైద్యులు గ్రామస్థులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. గ్రామంలోని కంటిపరీక్షలను నిర్వహించి, సిద్దిపేట ఎల్‌వీప్రసాద్ ఆసుపత్రిని రోగులకు రిఫర్ చేశారు. ఈకార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ సిబ్బంది రాకేష్, భార్గవ్, తాజా మాజీ సర్పంచు కాలేరు శ్రీనివాస్. గ్రామస్థులు బాపురెడ్డి, యాదయ్య, రాజిరెడ్డి, బాల్‌లింగంతదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు 'కొమ్మూరి' శంకుస్థాపన

మద్దూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్, నర్సాయపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు స్థానిక నాయకులతో కల్సి జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాగిళ్లాపూర్, నర్సాయపల్లిలో జీపీ భవనాలకు ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షల చొప్పున మంజూరు అయ్యాయని తెలిపారు. మహిళా సంఘ భవన శంకుస్థాపనకు వెళ్లే క్రమంలో గ్రామానికి దూరంగా నిర్మించవద్దని మహిళలు ఇబ్బందులు పడతారని జీపీ భవనం వద్దే నిర్మించాలని కొమ్మూరితో వడ్లకొండ మంజుల స్థానిక మహిళలతో కలిసి వాగ్వివాదానికి దిగారు. భవనం కోసం స్థలాన్ని అందించాలని కొమ్మూరి చెప్పినా వినకపోవడంతో తన వంతుగా స్థలాన్ని అందివ్వాలని రూ.50 వేలు సొంతంగా ఇస్తానన్నా వినకపోవడంతో శంకుస్థాపనను కొనసాగించేందుకు పోరాడుతున్న గ్రామ మహిళా సంఘానికి రూ10 లక్షలతో మంజూరైన భవనానికి స్థల ప్రభావంలో తలెత్తిన ఇబ్బందుల మూలంగా తను పుట్టిన స్థలాన్ని తన తాత నానమ్మ జ్ఞాపకార్థం 140 గజాల స్థలాన్ని మహిళా సంఘానికి బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రమేష్ రెడ్డి, మారెల్ల భాస్కర్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.


మహిళా సంఘం భవనం విషయంలో కొమ్మూరితో వాగ్వాదానికి దిగిన మహిళలు

కమలాకర్ సేవలు అభినందనీయం

మద్దూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కులమతాలకతీతంగా విద్యార్థులకు సామాజికంగా సేవలందిస్తున్న చెట్కూరి కమలాకర్‌యాదవ్ సేవలు అభినందనీయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. బుధవారం దూళిమిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థులకు టైలు, బెల్టులు, గుర్తింపు కార్డుల జారీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. జనగామ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్ దూళిమిట్ట మండలం 11 గ్రామాల్లోని 17 పాఠశాలల్లో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్న 900 మంది విద్యార్థులకు అందించడం గొప్ప అనుభూతి కలిగిందన్నారు. ప్రతి ఒక్కరు సామాజికంగా సేవలు అందించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దూళిమిట్ట మండల అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. పాఠశాల మౌలిక వసతులకు తన నిధుల ద్వారా రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

బడి కోసం ఎంతైనా ఖర్చు పెడతా

- లయన్ సూర్యరాజు

మర్కుక్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధిస్తున్న ప్రగతికి ఇంకా ఎన్ని లక్షల రూపాయలైనా ఖర్చు పెట్టడానికి నేను సిద్ధమని లయన్ సూర్యరాజు అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యరాజు ఈ బడి కోసం ఇంకా ఇంకా ఎంత ఖర్చైనా చేయడానికి నేను సిద్ధమని కేవలం మీరు చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండి నాలాగా గొప్ప స్థాయిలో ఉండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాఠశాల కళాతోరణం సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన రాయల్ సూర్యరాజు పాఠశాల ఆంగ్ల బాష ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు విన్నపం మేరకు 20 కంప్యూటర్లను బహుమతిగా ఇచ్చి విద్యార్థుల కంప్యూటర్ చదువులకు సహకరించారు. పాఠశాలలో చదువుతున్న 250 మంది విద్యార్థులకు అందరికీ బ్యాగులు, షూలు అందజేశారు.

కేసీఆర్‌పై మోదీ కుట్ర

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మోదీ పదేళ్ల పాలనలో వైఫల్యాలను ఎత్తి చూపినందుకే కేసీఆర్ కుట్ర పన్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కవిత ఆరోపణల వెనుక రేవంత్‌రెడ్డి, మోదీ ఉన్నారని, గత ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించడానికి మోదీ రేవంత్‌రెడ్డికి ఫండింగ్ చేశారన్నారు. మోదీ కుట్రలో భాగంగానే ఇటీవల సీబీఐకి కాళేశ్వరం అంశాన్ని అప్పగించారని చెప్పుకవచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో 20 మాసాల కాలంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఏ ఒక్కరిని కదిలించిన కేసీఆరే మళ్లీ రావాలని చెబుతున్నారని అన్నారు. గతంలో తాను చేసిన ఆరోపణల విషయాన్ని కవిత ప్రస్తావించారని, ఎన్నికల సమయంలో ఆధిక్యం కోసం మాట్లాడిన మాటలేనని అందులో నిజం లేదన్నారు.


గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

క్రీడల్లో గెలుపోటములు సహజం

చిన్నకోడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :క్రీడల్లో గెలుపోటములు సహజమని మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు. చిన్నకోడూరు హై స్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన క్రీడా పోటీల్లో గెలుపొందిన టీంలకు ఎంఈవో యాదవరెడ్డితో కలిసి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

సందడిగా ఫ్రెషర్స్ డే

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే సందడిగా సాగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. లఘు నాటికలు, గ్రూప్ డ్యాన్స్‌లు, జానపద గీతాలకు ఆడిపాడి సందడి చేశారు. భరత నాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ జీవన్ కుమార్ మాట్లాడుతూ కళాశాల సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. కష్టపడి చదివి మంచి భవిష్యత్‌తో పాటుగా కళాశాలకు పేరు తీసుకరావాలని సూచించారు.

మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన

ములుగు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ములుగు మండలం మామిడాల గ్రామంలో ములుగు ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో షీటీం ద్వారా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మహిళా భద్రత, సైబర్ సెక్యూరిటీ మరియు సైబర్ బుల్లీయింగ్‌పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

శారీరక ధృడత్వానికి క్రీడలు ఎంతో అవసరం

దౌల్తాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలు అనేవి శారీరక ధృడత్వానికి ఎంతో అవసరమని మండల విద్యాధికారి గజ్జల కనకరాజు అన్నారు. ఇటీవల జరిగిన అండర్ 14-17 ఎస్జీఎఫ్ క్రీడల్లో గెలుపొందిన ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆయా ఆటల్లో ప్రతిభ కనబరిచి విజయాలు సాధించారు. బుధవారం మండల విద్యాధికారి గజ్జల కనకరాజు గెలుపొందిన జట్టు విజేతలకు బహుమాతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో గజ్జల కనకరాజు మాట్లాడుతూ. విద్యార్థి దశ నుంచే బాలికలు, బాలురు, క్రీడలపై దృష్టి సాధించాలని తెలిపారు. ఓటమి చెందిన విద్యార్థులు నిరాశ చెందకుండా మరోసారి జరిగే క్రీడల్లో తమ సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, గోపాల్ రెడ్డి , నరసింహులు ,గోవర్ధన్ రెడ్డి , హరికృష్ణ, సత్యనారాయణ, మహేష్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ విష్ణు, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, సాయి కృష్ణ, డంబెల్, ప్రత్యూష ,అనిత ,మోహన్ , వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎల్ఎం మేళాలతో విద్యార్థులకు లాభం

కొమురవెల్లి, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన ప్రాథమిక,ప్రాథమికోన్నత ఉపాధ్యాయుల మండలస్థాయిటీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హజరై బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎల్ఎం మేళాల ద్వారా ఉపాధ్యాయుల్లో సృజనాత్మకత పెరిగి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధనోపకరణాలను తయారుచేసి తరగతి గదులలో బోధించడం జరుగుతుందన్నారు. వివిధ సబ్జెక్ట్‌లలో ఉత్తమ బోధనోపకరణాలను ప్రదర్శించిన ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను మండల విద్యాధికారి బొమ్మగోని రమేష్ అందించారు.


ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనోపకరణాలను పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

రాయపోల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ధనరాజ్ బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వైరల్ జ్వరాలు వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలోని ల్యాబ్, ఫార్మసీ, ఓపీ, ఐపీ సేవల వివరాలడిగి తెలుసుకున్నారు.కొత్తపల్లిలో 14 ఏళ్ల బాలునికి డెంగీ లక్షణాలు ఉన్నాయని సమాచారం అందడంతో ఆ గ్రామాన్ని సందర్శించారు.